క్లుప్తంగా

దేవాలయానికి వెండి శఠగోపం విరాళం



ఆలయానికి సమర్పించిన వెండి శఠగోపం

పగిడ్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోటలో వెలిసిన కాశీవిశ్వేశ్వర, నందీశ్వర దేవాలయానికి ఓ భక్తుడు వెండి శఠగోపం విరాళంగా ఇచ్చి భక్తిని చాటుకున్నట్లు పురోహితులు జగదీశ్వరయ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన తలారి శివన్న కుమారులు సూర్య, చంద్రలు సుమారు రూ. 50 వేల విలువ చేసే వెండి శఠగోపాన్ని పూజారి జగదీశ్వరయ్య చేతుల మీదుగా ఆలయానికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ ధర్మకర్తలు తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బొల్లవరంలో పైపులైన్ పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి నూరుల్లా

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి నూరుల్లా తెలిపారు. సోమవారం గ్రామంలో తాగునీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేయించి, వాల్‌లను ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు. పైపులైన్‌కు వాల్‌లను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు.

పంటనష్ట పరిహారం జాబితా విడుదల



మల్యాలలో పంటనష్ట పరిహారం జాబితాను పరిశీలిస్తున్న రైతులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని మల్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద 2023 రబీ సీజన్‌కు సంబంధించిన పంట నష్ట పరిహారం జాబితాను విడుదల చేసినట్లు వీఏఏ శాంతిరాజు తెలిపారు. వీఏఏ మాట్లాడుతూ పంట నష్ట పరిహారం వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ఉంచినట్లు తెలిపారు. పంట నష్ట పోయిన రైతులు తమ పేర్లను జాబితాలో పరిశీలించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు ఎల్లనాయుడు, మద్దిలేటి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలూరులో యూనియన్ బ్యాంక్ శాఖ



తుమ్మలూరులో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న రీజినల్ మేనేజర్ పీ. నరసింహారావు

నందికొట్కూరు: పాములపాడు మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో యునియన్ బ్యాంక్ శాఖను రీజినల్ మేనేజర్ పీ నరసింహారావు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ లక్ష్యమన్నారు. తమ బ్యాంక్ ప్రజలకు సేవలు అందించేందుకే మీ ముందుకు వచ్చిందని చెప్పారు. జోనల్ మేనేజర్ సీవీఎస్ భాస్కర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ జీ. తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న బైరాపురం మహబూబ్‌బాషా

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం గడ్డపై మరలా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం షేక్ మహబూబ్‌బాషా ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక రైతు సేవా సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారన్నారు. ప్రజల ఆశీస్సులు పార్టీకి, ఎమ్మెల్యేకు, సీఎంకు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మోమిన్ మునీర్‌బాషా, వెంకటేశ్వర్లు, టైగర్ బాబు, అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టీకాయే పశువులకు రక్ష

- సీజనల్ వ్యాధులు వ్యాపించకముందే టీకాలు వేయించాలి
- ముమ్మరంగా ఉచిత టీకాల కార్యక్రమం
- నియోజకవర్గంలో 57 వేల ఆవులు, బర్రెలు, 2.41లక్షల జీవాలకు వ్యాక్సిన్



పగిడ్యాలలో పశువుకు టీకా వేస్తున్న వైద్యాధికారులు

జూపాడుబంగ్లా: అప్రమత్తంగా ఉంటేనే పశువులను సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షించుకొని, తద్వారా జీవనోపాధి మెరుగుపర్చుకోవచ్చు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కొత్తగా మొలకొచ్చిన పశుగ్రాసాన్ని తినడంతో పాటు సీజనల్‌గా తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి, నల్లజాతి పశువులైన బర్రెలు, పడ్డలు, దున్నల్లో గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లల్లో చిటెకె వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకుగాను పశుసంవర్ధకశాఖ అధికారులు ఉచితంగా టీకాలు వేస్తున్నారు.

ఇప్పటి దాకా 40 శాతం పశువులకు టీకాలు

నందికొట్కూరు నియోజకవర్గ వ్యాప్తంగా పశువులకు ఉచిత టీకాల కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నియోజవర్గంలోని ఆరు మండలాల్లో 21,376 ఆవులు, 35,623 బర్రెలు, 2,16,346 గొర్రెలు, 24,726 మేకలుండగా వాటిల్లో ఇప్పటిదాకా 57 వేల ఆవులు, బర్రెలు, 2.41లక్షల జీవాలకు వ్యాక్సిన్ వేసి 40 శాతం పూర్తి చేసినట్లు పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ తెలిపారు.

తెల్ల, నల్లజాతి పశువులు, జీవాల్లో సీజనల్‌గా వ్యాపించే వ్యాధులు, లక్షణాలు, చికిత్స ..

నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి..

నల్లజాతి పశువులైన బర్రెలు, పడ్డలు, దున్నల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో గొంతు కింద భాగం నొప్పితో కూడిన వాపులుంటాయి. ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుతుంది. తద్వారా ఊపిరితీసుకోవడం పశువులకు ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతో పాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాతపడే అవకాశాలున్నాయి. ఇలాంటి లక్షణాలున్న పశువులకు వెంటనే రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్సలు అందించాల్సి ఉంటుంది. గొంతువాపు వ్యాధి నివారణకు ప్రతి ఏటా మే, జూన్ మాసాల్లో హెమరేజిక్ సెప్టిసీమియా టీకాను వేయించుకోవాలి. వ్యాధి వ్యాపించిన పశువులకు సత్వరమే పశువైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలి.

తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి..

ప్రస్తుత సీజన్‌లో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల జబ్బ, వెన్ను, తొడ తదితర కండగల శరీర భాగాల్లో నల్లటి వాపు కనిపిస్తుంది. ఈ వాపును చేతితో నొక్కినప్పుడు బుడగ మాదిరి శబ్దం వస్తుంది. జ్వరం రావడంతో మేత మేయకపోవడం, కదలలేకపోవడం, కడుపునొప్పి వంటి లక్షణాలుంటాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించకపోతే రెండు నుంచి నాలుగు రోజుల్లో పశువులు మరణించే అవకాశాలున్నాయి. జబ్బవాపు వ్యాపించడానికి ముందే పశువులకు బ్లాక్‌క్వార్టర్ టీకాను వేయించాలి. ఓ వేళ జబ్బవాపు వ్యాధిబారినట్లయితే పశువులకు పెన్సిలిన్ ఇంజెక్షన్లతో పాటు పశువులకు సెలైన్ బాటిళ్లు పెట్టించి చికిత్స చేయించాలి.

జీవాల్లో చిటికె వ్యాధి..

చిటుక వేసినంత కాలంలోనే జీవాలకు ఈ చిటుక (చిటికె) వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి క్లాస్ట్రిడియం పెర్‌ఫ్రిజన్స్ టైపు డి అనే బ్యాక్టీరియా వల్ల జీవాల్లో వ్యాపిస్తుంది. తొలకరి వర్షాలు కురిశాక మొలచిన లేతగడ్డిని మేసినప్పుడు వాటిల్లో ఉండే బ్యాక్టీరియా, క్రిములు జీవుల శరీరంలోకి వెళ్లడం ద్వారా చిటుకవ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన జీవాలకు వెంటనే చికిత్సలు నిర్వహించకపోతే చనిపోతాయి. ఈ వ్యాధి వ్యాపించిన జీవాలు నీరసంగా ఉండటం, జ్వరం రావడం, గడ్డి తినక పోవడం వంటి లక్షణాలుంటాయి. ఈ వ్యాధి వ్యాపించిన జీవాలు చనిపోయే ముందు గాల్లోకి ఎగిరి గిలగిలా కొట్టుకుంటాయి. ఉదయం, మధ్యాహ్న వేళల్లో ఈ వ్యాధి లక్షణాలు జీవాల్లో అధికంగా కనిపిస్తాయి. జీవాలకు చిటుక వ్యాధి వ్యాపించకుండా ముందుజాగ్రత్తగా ఎంటరోటాక్సిమియా అనే టీకాను వేయించాలి. తద్వారా జీవాలకు చిటుక వ్యాధి వ్యాపించకుండా నివారించవచ్చు.

1902ను సద్వినియోగం చేసుకోవాలి

తెల్ల, నల్లజాతి పశువులతో పాటు జీవాలకు ఏదేని వ్యాధులు వ్యాపించి అత్యవసర చికిత్సలు నిర్వహించాల్సి వస్తే సత్వరమే 1902కు ఫోన్‌చేస్తే వెంటనే సంచార పశువైద్యశాల వాహనం వచ్చి పశువులు, జీవాలకు వైద్యం అందిస్తుంది. అవసరమైతే వైద్యశాలలకు తరలించి మెరుగైన వైద్యం అందించి తిరిగి ఇంటివద్దకు చేర్చుతారు.

టీకాలు వేయించడం ఉత్తమం



వర్షాకాలం ప్రారంభంలో తెల్ల, నల్లజాతి పశువులతో పాటు జీవాల్లో అధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. ముందుజాగ్రత్తగా వాటి సంరక్షకులు పశువులు, జీవాలకు టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చు. టీకాలు వేయించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే సీజనల్‌గా వ్యాపించే జబ్బవాపు, గొంతువాపు, చిటుక వ్యాధుల బారిన పడి పశువులు మృతిచెందే అవకాశాలున్నాయి. పశుపోషకులు ప్రభుత్వం ఉచితంగా వేస్తున్న టీకాలను పశువులు, జీవాల వేయించి నష్టాన్ని నివారించుకోవాలి.

– రామాంజనేయనాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ, జూపాడుబంగ్లా

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్షలకు 353 మంది విద్యార్థులకు గాను 342 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 719 మందికి గాను 170 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్షావలి తెలిపారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఇంగ్లిషు పరీక్షకు 111 మంది విద్యార్థులకు గాను 27 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 54 మందికి గాను 11 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 57 మంది విద్యార్థులకు గాను 16 మంది పరీక్షలు రాశారు.

అర్హులందరికీ 'ఆసరా'

కొత్తపల్లి: అర్హులైన అందరికి వైఎస్సార్ ఆసరా 4వ విడత నగదు మొత్తం జమ అవుతుందని, పడలేదని ఎవరూ అధైర్యపడొద్దని ఏపీఎం పుల్లయ్య సూచించారు. సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం నాల్గవ విడతగా వైఎస్సార్ ఆసరా కింద 532 గ్రూపు సభ్యులకు నిధులు విడుదల చేసిందన్నారు. ఈ గ్రూపులలోని సభ్యులకు రూ.3,32,17,983 మొత్తం దశలవారీగా వారి బ్యాంకు ఖాతాలలో జమ అవుతుందన్నారు. కొంత మంది సభ్యులకు ఇంకా డబ్బులు పడలేదని ఆందోళన పడుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి వారి ఖాతాలలోకి నగదు తప్పకుండా జమ అవుతుందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ



మధ్యాహ్న భోజన కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాజిదా ఫిర్దోస్

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. శిక్షణలో డాక్టర్ సాజిదా ఫిర్దోస్ హాజరై న్యూట్రీషన్ ఆహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారంతో కూడిన భోజనం తింటే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అలాగే అగ్నిమాపక కేంద్రం అధికారులు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం వంటల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఆత్మకూరు జెడ్పీహెచ్‌ఎస్, రెండో బహుమతి ఎంపీపీఎస్ సంతమార్కెట్, మూడో బహుమతి ఎంపీపీఎస్ వీఆర్.నగర్ పాఠశాలలు అందుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ–2 సురేష్, హెచ్‌ఎం అయూబ్‌అహ్మద్, రిసోర్స్ పర్సన్ స్వాతి, ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ శ్రీనివాసరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం సప్లిమెంటరీ ద్వితీయ సంవత్సరం పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం మాథ్స్ (ఏ), బాటనీ, సివిక్స్ పరీక్షలకు 47 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన మాథ్స్ (బీ), సివిక్స్ పరీక్షలకు 14 మందికి ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్, డిపార్టుమెంటల్ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పదో తరగతి పరీక్షకు 53 మంది గైర్హాజరు

స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ స్వరూప సోమవారం తనిఖీ చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి సాయితిమ్మయ్య, డిపార్టుమెంటల్ అధికారి మహేష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ఇంగ్లిషు పరీక్షకు 71 మంది విద్యార్థులకు గాను 18 మంది హాజరైనట్లు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఈశ్వరుడు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన బిల్వార్చన పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్వతీమాతకు కుంకుమార్చన, విశేష పూజలు చేపట్టారు. జూన్ 1న దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పట్టణంలోని పాత బస్టాండులో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

తాగునీటి సమస్యకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్

ఆత్మకూరు: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య లేకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారన్నారు. బోర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనంతరం పలువురు ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలో నీటి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పలు గ్రామాల్లో మంచి నీటి సరఫరాకు నిధులు ఉన్నా అభివృద్ధి పనులు చేయలేక పోయామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎంపీపీ నిధుల ద్వారా గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సమాధానమిచ్చారు. వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య, వీధి దీపాలు తదితర విషయాలపై అధికారులు ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా టిప్పర్లు తిరిగి ధ్వంసమైన రోడ్డు స్థానంలో మండ్లెంలోని కేజీ రోడ్డు నుంచి మారెమ్మ గుడి వరకు రోడ్డు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండ్లెం గ్రామంలో కేజీ రోడ్డుపై ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ఎల్.స్వాములు ఆధ్వర్యంలో ధాస్తారోకో నిర్వహించారు. కాంట్రాక్టర్ స్పందించి పల్లెల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని, లేని ఎడల నిర్మాణం పనులను అడ్డుకుంటామని తెలిపారు.

చేపలవేటకు అనుమతివ్వాలి



ఎఫ్ఆర్వో పట్టాభికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కృష్ణా పరివాహక ప్రాంతమైన చీమలతిప్ప ప్రాంతంలో కృష్ణానదిలో చేపల వేటకు అనుమతి ఇవ్వాలని మత్స్యకారులు చిట్టెమ్మ, నారాయణ, సుంకన్న, తోటయ్య, రమణ, వెంకటేశ్వర్లు, శివన్న, గోపాల్, వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం చీమలతిప్ప, గువ్వలకుంట్ల గ్రామాల మత్స్యకారులు జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డితో కలసి ఆత్మకూరు అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్టు రెంజ్ అధికారి పట్టాభికి వినతిపత్రం అందించారు. మత్స్యకారులు మాట్లాడుతూ చీమలతిప్ప ప్రాంతంలో గత 40 ఏళ్లనుంచి సుమారు 50 కుటుంబాలు కృష్ణానదిలో చేపలవేట చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఫారెస్టు అధికారులు తమను అక్కడ నివాసాలు ఉండవద్దని ఖాళీ చేయించడం బాధాకరమన్నారు.

స్థిరనివాసం ఉండేందుకు వీలు లేదు

కొత్తపల్లి మండలంలోని చిమలతిప్ప నల్లమల అటవీ ప్రాంతాన్ని ఈ ఏడాది టైగర్ జోన్‌లో వీలినం చేశారని, అక్కడ స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలు లేదని ఆత్మకూరు ఎఫ్ఆర్వో పట్టాభి తెలిపారు. అక్కడ వన్యప్రాణుల సంచారం ఎక్కువైనందున, క్రూరమృగాల వల్ల ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. చేపలవేట మాత్రమే చేసుకున్నా అక్కడ ఉండకూడదు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తజనసందడి

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను అలంకార మండపంలో కొలువు చేసి విశేషంగా అలంకరించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు, బలిహరణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామి, అమ్మవారు విహరించారు.

భక్తులతో పోటెత్తిన మహానంది

పరమేశ్వరుడికి ప్రీతికరమైన సోమవారం కావడంతో మహానంది ఆలయం వేలాది మంది భక్తజనంతో పోటెత్తింది. వేకువజామున మహామంగళహారతుల సమయం నుంచి రాత్రి వరకు భక్తుల దర్శనం నిర్విరామంగా కొనసాగింది.

విద్యుత్ మోటార్ చోరీ

మహానంది: బండిఆత్మకూరు మండలం జి.లింగాపురంలో గ్రామానికి చెందిన రైతు కుమ్మరి కృష్ణుడు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. కృష్ణుడు తన కున్న 40 సెంట్ల పొలంలో కూరగాయలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో పొలం సాగుకు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్‌ను చోరీ చేశారని రైతు వాపోయాడు. సుమారు రూ. పదివేలు విలువ ఉంటుందని చెప్పాడు.

ఇంటర్ ఫస్టియర్‌లో 8 సీట్లు ఖాళీ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ బైపీసీ గ్రూపులో 8 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ఎస్‌ఓ యశోద సోమవారం తెలిపారు. పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌కు గాను కేవలం బైపీసీ గ్రూపు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. అందులో 40 సీట్లు ఉండగా ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో అర్హులైన వారిని జిల్లా అధికారులు ఎంపిక చేసి వారికి సమాచారం అందించినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో 32మంది కళాశాలలో ఆడ్మిషన్లు పొందగా.. కొంత మంది ఆడ్మిషన్ తీసుకోకపోవడం, ఇతర కళాశాలల్లో చేరడంతో 8 సీట్లు మిగిలాయని చెప్పారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో నాలుగు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భర్తీచేస్తామన్నారు.

గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలి



క్యారమ్స్‌లో నిమగ్నమైన విద్యార్థులు

పగిడ్యాల: స్థానిక గ్రంథాలయంలో రూ.50లు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని లైబ్రేరియన్ మద్దమ్మ కోరారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు విక్రమ బేతాళ కథలోని తెలివైన కోతి అనే నీతి కథను వినిపించారు. విద్యార్థులు సభ్యత్వం కలిగి ఉంటే అవసరమైన పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు కూడా జనరల్ నాలెడ్జ్, విజేత కాంపిటీషన్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత క్యారమ్స్, చెస్, రింగ్ ఆట తదితర క్రీడల్లో మెలకువలను నేర్పించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్‌తో చర్చిస్తున్న ఈఓఆర్డీ శ్రీనివాసులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఈఓఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, సోమయాజులపల్లె గ్రామాల్లో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పార్నపల్లెలో సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, కార్యదర్శి వెంకటరాముడుతో కలిసి స్థానిక పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈఓఆర్‌డీ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి నెలా నిర్ణీత సమయంలో ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయాలన్నారు. అలాగే రికార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

విజయోత్సవాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మల్యాలలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

నందికొట్కూరు రూరల్: ఎన్నికల కౌంటింగ్ అనంతరం విజయోత్సవాల పేరుతో బాణా సంచా కాల్చినా, ర్యాలీలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐలు ప్రకాశ్‌కుమార్, విజయభాస్కర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని అల్లూరు, మల్యాల గ్రామాలలో పోలీసు సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.ఐలు నాగార్జున, జయశేఖర్, లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులను సాధించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షుడు ఆర్వపాల్

ఆత్మకూరు: ఐక్యంగా ఉంటే హక్కులను సాధించవచ్చని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని ఏపీ హంస రాష్ట్రాధ్యక్షుడు ఆర్వపాల్ అన్నారు. పట్టణంలోని స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రవీణ్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడిగా కరుణాకర్, అసోసియేషన్ అధ్యక్షురాలిగా సరోజ, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, శ్రీదేవి, సోమక్క, ఈసీ సభ్యులుగా భాస్కర్‌రావు, మౌలీబాషా, కార్యదర్శిగా లింగన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రహంతుల్లా, రత్నమ్మ, ఖాన్, ట్రెజరర్‌గా విశ్వనాథంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి షఫీ, జిల్లా అధ్యక్షులు రవిబాబు, భాస్కర్, చంద్రుడు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే రౌడీషీట్



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: నాటుసారా తయారు చేసినా, అమ్మినా రౌడీషీట్ పెడతామని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రమఠం చెంచుగూడెం సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాడుల్లో 900 లీటర్ల బెల్లంఊట, 15 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా బట్టీని ఎర్రమఠం గ్రామానికి చెందిన బోయ వెంకటస్వామి నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిర్వహకుడు పోలీసుల రాకను గుర్తించి పరారయ్యాడని తెలిపారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శేషారాంసింగ్, కానిస్టేబుల్ ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.